సాక్షి
మంచిర్యాల
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

పీఎస్సార్‌ను పరామర్శించిన మంత్రి వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

చెన్నూర్/మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్)ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదివారం పరామర్శించారు. అనారోగ్యం కారణంగా ప్రేమ్ సాగర్‌రావు హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంత్రి ఆస్పత్రికి వెళ్లి ఎమ్మెల్యేను పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

21లోపు టీచర్లు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: ఆయాదేశాల్లో విద్యాబోధన విధానాలను అధ్యయనం చేయడానికి ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ అండ్ విజిట్ ఎడ్యుకేషన్ ఎక్స్చేంజ్ ఫర్ టీచర్స్ ప్రోగ్రాంకు అర్హత కలిగిన టీచర్లు ఈనెల 21లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యాదయ్య తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులను జిల్లా కమిటీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పేరు, హోదా, పనిచేసే స్థలం, ప్రస్తుత కేడర్‌లో మొదటి నియామకం తేదీ, పాస్‌పోర్టు నంబర్ తదితర పూర్తి డాక్యుమెంటరీ, ఎవిడెన్స్‌తో నిర్మిత ప్రొఫార్మాలో అందజేయాలని వివరించారు.

అట్టహాసంగా చెస్ పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న అధికారులు

తాండూర్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 బాల, బాలికలకు జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు మండలంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించి పోటీలను ప్రారంభించారు. ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి ఇదే ప్రాంగణంలో త్వరలో నిర్వహించే జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల అకాడమీ డైరెక్టర్ సౌమ్య, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి యాకూబ్, పాఠశాల ప్రిన్సిపాల్ సరోజని, చెస్ ఆర్బీటర్స్ సమ్మయ్య, ఆకాశ్, కార్తీక్, పరిశీలకులు పాశం శ్రీనివాస్, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శులు బాలకృష్ణ, రాజు, తారకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రి వివేక్ వెంకటస్వామి ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మంత్రి పీఏ రాకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్ మాట్లాడుతూ జీవో 69 రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు వెలిశాల కృష్ణమూర్తి, యూనియన్ జిల్లా కార్యదర్శి శ్యాంరావు, కోశాధికారి రాంబాయి, ఉపాధ్యక్షురాలు హీరాబాయి, నాయకులు తార, జంగుదేవి, బాపురావు, అరిగెల కోటయ్య, శ్యామల, పద్మ, సముద్రబాయి, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి.. ఆనందకేళి

కావాలి

- చీకటి పారదోలి.. ఆనంద జ్యోతులు వెలగాలి
- విజయానికి ప్రతీకగా, సాంస్కృతిక సంపద
- టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి



టపాసుల దుకాణంలో కొనుగోలు దారులు

మంచిర్యాలఅర్బన్: దీపావళి అర్థం 'దీపాల వరుస' అని, ఇది చీకటిపై వెలుగు, చెడుపై మంచి విజయంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. భారతీయ సమాజంలో దీపావళి పండుగకు అపార ప్రాధాన్యత ఉంది. ఈ పండుగ వారం రోజుల పాటు జరుపుకుంటారు, ముఖ్యంగా ఆశ్వయుజ మాసం కృష్ణ పక్ష అమావాస్య నాడు లక్ష్మీదేవి పూజ చేస్తారు. ఈ సందర్భంలో ఆత్మజ్ఞానానికి దీపం, శుభాకాంక్షలకు దీపావళి వెలుగులు ప్రతీకలుగా నిలుస్తాయి.

గ్రీన్ దీపావళి..

ఈ సంవత్సరానికి ప్రత్యేకంగా పర్యావరణ హితం దృష్టిలో ఉంచుకుని 'గ్రీన్ దీపావళి' నిర్వహించేందుకు ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నారు. టపాకాయల వాడకం వాతావరణ, శబ్ద కాలుష్యాలకు దారి తీస్తుంది, ఇది ప్రజలకు, పర్యావరణానికి హానికరం. అందువల్ల మట్టి ప్రమిదల వాడకాన్ని ప్రోత్సహిస్తూ, విద్యుత్ ప్రమిదలకు స్థానమివ్వడం జరుగుతోంది. ఇది దీపావళి పండుగను పర్యావరణ అనుకూలంగా మార్చడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

దీపాల వెలుగులో బతుకుదిశలు

దీపం బ్రహ్మ, విష్ణు, మహేశ్వర మూర్తుల ఆధ్యాత్మిక ప్రతీక. దీపావళిలో లక్ష్మీదేవిని ప్రత్యేకంగా ఆరాధించడం సంప్రదాయం. గ్రామాల్లో మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి, చెడు దూరం కావాలని, శుభం చేరాలన్న విశ్వాసంతో పూజలు జరుపుతారు. ప్రమిదల తయారీ వెనక ఎంతో మంది శ్రమ దాగి ఉంది. కుమ్మరులు స్థానికంగా ప్రమిదలను తయారు చేయటం ఆనవాయితీ. ప్రస్తుతం ఇతర దేశాల నుంచి విద్యుత్ ప్రమిదలు ఎన్నో మార్కెట్‌లో లభిస్తున్నాయి. మట్టి ప్రమిదలతోనే దీపాలకు ప్రాధాన్యతనిస్తూ పర్యావరణ దీపావళి జరుపుకోవాల్సిన అవసరం ఉంది.

పండుగలో జాగ్రత్తలు

దీపావళిలో టపాకాయలు, బాణాసంచా వంటివి పిల్లల కోసం ఎంతో ఆకర్షణగా ఉంటాయి. కానీ వీటిని వాడేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. టపాకాయలు కాల్చేటప్పుడు దూరంగా ఉండటం, చిన్న పిల్లలు పెద్దవారి పర్యవేక్షణలో ఉండటం అవసరం. శబ్ద కాలుష్యంతోపాటు టపాకాయల పొగ కారణంగా శ్వాసకోశ సమస్యలు, వినికిడి సంబంధిత ప్రమాదాల రెక్కతీస్తున్నారు. సురక్షితంగా పండుగను జరుపుకోవడం అవసరం. చేతులు కడుక్కోవడం, కళ్ళు తేలికపర్చుకోవడం వంటి ఆరోగ్య సంరక్షణ చర్యలు పాటించడం మంచిది.

టపాసుల ధరలకు రెక్కలు



కత్తెరసాలలో టపాసుల దుకాణాలు

చెన్నూర్‌రూరల్: దీపావళి సందర్భంగా టపాసుల అమ్మకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. వ్యాపారులు ధరలు విపరీతంగా పెంచారు. చెన్నూర్ రూరల్ మండలం కత్తెరసాల గ్రామ సమీపంలోని ఓ గోదాంలో నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచారు. కిలో టపాసులు రూ.600 కిలో చొప్పున విక్రయిస్తున్నారు., ఏటా ధరలు పెరుగుతుండటంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు.

'సాక్షి'పై దాడి.. పత్రికా స్వేచ్ఛపై దాడే



సాక్షి పత్రికపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా దాడులు చేయడం.. పత్రికా స్వేచ్ఛపై దాడిగానే పరిగణించాలని జిల్లాకు చెందిన పలువురు అభిప్రాయపడ్డారు. పత్రికలు ప్రజలకు, పాలకులకు వారధిగా ఉంటాయన్నారు. మీడియా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు.

కక్షపూరిత చర్యలు మానుకోవాలి



పాతమంచిర్యాల: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం సాక్షిపై చేస్తున్న దాడి అప్రజాస్వామికం. సాక్షి రాస్తున్న వార్తల్లో కుట్ర కోణం ఉందని అక్కడి ప్రభుత్వం ఎడిటర్‌పై, ఇతర సిబ్బందిపై విచారణ పేరుతో పోలీసులతో భయభ్రాంతులకు గురిచేయడం సరికాదు. ఇది ముమ్మాటికి ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలి. ప్రభుత్వంపై విమర్శనాత్మక కథనాలు రాస్తే కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదు.

– తోట రాజేశ్, పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ

దాడులు అప్రజాస్వామికం



భీమారం: నిజాలు నిగ్గు తేల్చే కథనాలు ప్రచురిస్తున్న సాక్షి దినపత్రికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడటం అప్రజాస్వామికం. పాలనా వైఫల్యాలపై వార్తలు రాసేవారిపై అక్రమ కేసులు బనాయించడం సరైన పద్ధతి కాదు. ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిని కేసుల పేరుతో వేధించడం ద్వారా కూటమి ప్రభుత్వం తమ వైఫల్యాలను పరోక్షంగా అంగీకరిస్తోంది.

– కొమ్ము అశోక్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి

అక్రమ కేసులు ఎత్తివేయాలి



చెన్నూర్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. పదే పదే కూటమి ప్రభుత్వం పోలీసులతో సాక్షి కార్యాలయాలపై దాడులు చేయించడం హేయమైన చర్య. పత్రికల గొంతు నొక్కేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం సరికాదు. గతంలో పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించిన ప్రభుత్వాలు అడ్రస్ లేకుండా పోయాయి.

– సిద్ది రమేశ్ యాదవ్, భారత యాదవ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

కాకో ఆలయానికి పోటెత్తిన భక్తజనం



గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

- ఆకట్టుకున్న గుస్సాడీ నృత్యాలు..

దండేపల్లి: తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలం గుడిరేవు గోదావరినది ఒడ్డున ఉన్న ఆదివాసీల ఆరాధ్య దైవం అయిన శ్రీపద్మల్‌పురి కాకో ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వారం రోజులుగా జరుగుతున్న దండారీ ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణాలు రద్దీగా మారాయి. సమీప గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు ఒడ్డున గల పద్మల్‌పురి కాకోను దర్శించుకుని పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడే వంట చేసుకుని భోజనాలు చేశారు. ఆదివాసీల కోలాటాలు, గుస్సాడీల నృత్యాలు, భజనలు ఆకట్టుకున్నాయి.



భక్తులతో రద్దీగా కాకో ఆలయ ప్రాంగణం

చెన్నూర్ మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

- మున్సిపల్ చరిత్రలో ఉద్యోగి ఫిర్యాదు మొదటిసారి..
- గతంలో కాంట్రాక్టర్...



కమిషనర్‌పై ఉద్యోగి చేసిన ఫిర్యాదు పత్రం

చెన్నూర్: చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీలో గతంలో విధులు నిర్వర్తించిన ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ హరికాంత్ తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. తన ఒప్పంద కాలం పూర్తయినా, నూతనంగా కొనసాగింపు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా ఉద్యోగం నుంచి తొలగించారని, జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తనకు రావాల్సిన వేతనం రూ.94,962 చెల్లించకుండా వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

గతంలోనూ వివాదాలు..

మున్సిపల్‌లో కాంట్రాక్ట్ పనులు నిర్వహించిన సునీల్‌రెడ్డి కూడా ఇలాంటి సంఘటనను ఎదుర్కొన్నాడని చెబుతున్నారు. తనకు చెల్లించాల్సిన బిల్లులు ఇవ్వడంలో ఆలస్యం చేయడంతో ఆగస్టు 7న సునీల్‌రెడ్డి కమిషనర్‌తో వాగ్వాదానికి దిగాడు. కార్యాలయ ప్రాంగణంలోనే ఇద్దరూ గొడవపడ్డారు. అనంతరం సునీల్‌రెడ్డి చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని సమాచారం.

కమిషనర్ ప్రవర్తనపై విమర్శలు

మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మున్సిపల్ కార్యకలాపాలు వివాదాస్పదంగా మారాయి. ప్రజా సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారితో కమిషనర్ దురుసుగా మాట్లాడుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. కమిషనర్ రాకతో అభివృద్ధి పనులు మందగించాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

సిబ్బందికి వేధింపులు..

వార్డు ఆఫీసర్లను ఆదివారం విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. మహిళావార్డు ఆఫీసర్ ఆదివారం కార్యాలయానికి రాకపోవడంతో కమిషనర్ నోటీసు పంపినట్లు తెలిసింది. దీంతో ఆగమేఘాల మీద విధులకు హాజరైన సదరు వార్డు ఆఫీసర్ కార్యాలయంలో స్పృహతప్పి పడిపోయింది. ఈ విషయం బయటికి పొక్కకుండా వాహనం మాట్లాడి మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారని తెలిసింది. ఈ విషయమై కమిషనర్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

ఉద్యోగి ఫిర్యాదు చేశారు..

వేతనం ఇవ్వకుండా మానసికంగా, ఆర్థికంగా చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ వేధిస్తున్నాడని ఎన్విరాన్‌మెంట్ ఉద్యోగి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నాం.

– దేవేందర్‌రావు, సీఐ, చెన్నూర్

లక్కీ 'డ్రా'ప్.. లిక్కర్ కిక్..

- బీసీ బంద్‌తో గడువు పొడిగింపు
- ఈ నెల 23 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 18 వరకు 1,617 దరఖాస్తులు, రూ.48.51 కోట్ల ఆదాయం

ఈ నెల 18 వరకు రిజర్వేషన్ల వారీగా వచ్చిన దరఖాస్తులు

రిజర్వేషన్	కేటాయించిన షాపులు	దరఖాస్తులు
ఎస్సీ	10	188
ఎస్టీ	06	061
గౌడ్స్	06	122
ఓపెన్	51	1246

మంచిర్యాలక్రైం: నూతన మద్యం పాలసీ అమలుకు జిల్లాలోని 73 మద్యం షాపులకు ప్రభుత్వం గత నెల 26 నుంచి ఈ నెల 18 వరకు దరఖాస్తులు స్వీకరించింది. బీసీ రిజర్వేషన్లపై 18న అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో బ్యాంకులు బంద్ పాటించడం, వాహన సదుపాయం లేకపోవడంతో మద్యం వ్యాపారులు నిర్ణీత సమయంలో సెంటర్ వద్దకు చేరడంలో అంతరాయం కలిగింది. అభ్యర్థుల అర్జీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడగించింది.

వ్యాపారుల్లో ఉత్కంఠ

టెండర్ల గడువు పొడిగించడంతో వ్యాపారుల్లో మళ్లీ దడ మొదలైంది. తాము సమర్పించిన మద్యం దుకాణానికి మళ్లీ ఎంతమంది దరఖాస్తులు సమర్పిస్తారోనని టెన్షన్ పడుతున్నారు. జిల్లాలో 73 మద్యం షాపులకు నిబంధనల ప్రకారం 10 దరఖాస్తుల కంటే తక్కువ వచ్చిన దుకాణాలకు రీటెండర్ ఆహ్వానించడం జరుగుతోంది. జిల్లాలో ఈ నెల 18 వరకు సమర్పించిన దరఖాస్తుల్లో అధికంగా ఇందారం గెజిట్ నంబర్ 001కు 60 దరఖాస్తులు రాగా, అతి తక్కువగా బెల్లంపల్లి డివిజన్‌లోని కన్నెపల్లికి చెందిన గెజిట్ నంబర్ 001 మద్యం దుకాణానికి ఒకేఒక దరఖాస్తు వచ్చింది.

27న లక్కీ డ్రా

ఈ నెల 23న సీసీసీ పోలీస్‌స్టేషన్ సమీపంలోని పీవీఆర్ గార్డెన్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహించాల్సి ఉండగా దరఖాస్తుల గడువు పొడిగించడంతో ఎంపిక తేదీని ఈ నెల 27కు పొడిగించారు. టెండర్ల గడువు పొడిగించడంతో ఇప్పటి వరకు సిండికేట్ అయిన మద్యం వ్యాపారుల్లో గుబులు మొదలైంది. తమ పంథా మార్చుకుని బినామీ పేర్లపై మళ్లీ టెండర్లు వేసే పరిస్థితి నెలకొంది.

పెరిగిన ఆదాయం..

జిల్లాలో 73 మద్యం దుకాణాలకు ఈనెల 18 వరకు 1,617 దరఖాస్తులు రాగా ప్రభుత్వానికి రూ.48.51 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది 2,242 దరఖాస్తులు రాగా రూ.44.84 కోట్ల ఆదాయం వచ్చింది.

జీజీహెచ్‌లో సదుపాయాలు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న దుర్గం అశోక్

మంచిర్యాలటౌన్/కోటపల్లి: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ ఆదివారం జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే బెడ్‌పై ఇద్దరు పేషెంట్లకు చికిత్స అందిస్తున్నారని, మరుగుదొడ్లు చాలినంతగా లేకపోవడం, ఉన్నవి సైతం అపరిశుభ్రతతో వినియోగించలేని పరిస్థితి ఉందన్నారు. సరిపడా వైద్యులు, మౌలిక వసతులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు రోగులను రెఫర్ చేస్తున్నారన్నారు. కోటపల్లి మండల కేంద్రంలోని వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాకాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన రాంచందర్ సమస్యలను షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, బీజేపీ జిల్లా కార్యదర్శి మంత్రి సురేఖ రామయ్య, ఆఫీస్ కార్యదర్శి తోట మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఒకే మాను..రెండు చెట్లు



జన్నారం: ప్రకృతిలో అనేక వింతలు, విశేషాలు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. జన్నారం మండలం ధర్మారం వెళ్లే దారిలో పొలాల మధ్య జువ్వి, ఇప్ప చెట్లు పెనవేసుకుని ఎదిగాయి. ఒకే మానుకు రెండు చెట్లు ఉన్నట్లు కనిపిస్తూ ఆకర్షిస్తున్నాయి.

బాలమిత్ర అవార్డులకు ఆహ్వానం

మంచిర్యాలటౌన్: రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 14న బాలల దినోత్సవం పురస్కరించుకుని 33 రంగాల్లో ప్రతిభ కలిగిన 14 ఏళ్లలోపు విద్యార్థులకు రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. దేశభక్తి పాటలు, భరత నాట్యం, గిటార్, కీబోర్డు ప్లేయింగ్, ఫ్లూట్, పర్వతారోహణ, యోగా, చిత్రలేఖనం, కార్టూన్స్, కవితలు, జానపద నృత్యం, జానపద పాటలు, మిమిక్రీ, మ్యాజిక్, సైక్లింగ్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, ఫుట్‌బాల్, రన్నింగ్, జాతీయ సమైక్యత శిబిరం, కరాటే, కూచిపూడి, కోలాటం, తబలా, బతుకమ్మ, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, స్కేటింగ్, టెన్నిస్, ఆర్చరీలో నైపుణ్యం గల విద్యార్థుల వద్ద ఉన్న మెరిట్ సర్టిఫికెట్ల ఆధారంగా అవార్డు అందించడం జరుగుతుందని వివరించారు. మెరిట్ సర్టిఫికెట్లు, బయోడేటాతో నవంబర్ 5వ తేదీలోపు దరఖాస్తు చేయాలని తెలిపారు. వలస సుభాష్ చంద్రబోస్, ఇంటి నంబర్ 2–92, కూరెల్ల గ్రామం, కోహెడ మండలం, సిద్దిపేట జిల్లా, పిన్ 505473కు పంపించాలని సూచించారు.

క్లుప్తంగా

ఉడుము స్వాధీనం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామానికి చెందిన పశువుల కాపరులకు శనివారం రాత్రి సుబ్బరాంపల్లి మూలమలుపు వద్ద ఉడుము కనిపించడంతో పట్టుకున్నారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఉడుమును స్వాధీనం చేసుకున్నారు. చెన్నూర్‌లోని అటవీశాఖ కార్యాలయానికి తీసుకువెళ్లి పశువైద్యుడితో పరీక్షలు నిర్వహించారు. ఉడుము ఆరోగ్యంగా ఉందని తేలడంతో చెన్నూర్ అటవీప్రాంతంలో వదిలేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో సదానందం తెలిపారు.

పత్తి చేలపై అడవి పందుల దాడి

కోటపల్లి:మండలంలోని పిన్నారం గ్రామంలో పత్తి చేలపై ఆదివారం తెల్లవారం జామున అడవిపందులు దాడిచేసి నాశనం చేశాయని బాధిత రైతులు తెలిపారు. మండలంలో రైతులు అడవి పందులకారణంగా తీవ్రంగా నష్టపోతున్నా ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లాకార్యదర్శి మంత్రి రామయ్య ఆరోపించారు. పిన్నారంలో ఓ రైతు 14 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేయగా సగం పంటను అడవి పందులు నాశనం చేశాయని తెలిపాడు. బాధిత రైతుకు పరిహారం అందేలా చూడాలని కోరారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్తా



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కృష్ణ

ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన కొమ్ము కృష్ణ సత్తా చాటాడు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఆదివారం నిర్వహించిన పదవ తెలంగాణ మాస్టర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 100 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్లో గోల్డ్ మెడల్‌తో మెరిశాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలవడంపై డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి తదితరులు అభినందించారు.

అన్వేషిక ప్రయోగదర్శిని రూపకల్పనలో టీచర్

జైనథ్: ఎస్‌సీఈఆర్టీ వారు రూపొందించిన అన్వేషిక ప్రయోగదర్శిని రూపకల్పనలో జిల్లా ఉపాధ్యాయుడికి చోటు లభించింది. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు గోసుల సత్యనారాయణ 6వ తరగతి పాఠ్యాంశంలోని ప్రయోగ కృత్యాలను పుస్తకంలో పొందుపర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది సబ్జెక్ట్ ఉపాధ్యాయులు పాల్గొనగా, ఆదిలాబాద్ జిల్లా నుంచి ఈయన పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానం, విలువలు పెంపొందించడంతోపాటు ప్రయోగకృత్యాలను పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ అంశాలు ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు.

జన్నారం అందాలు చూసొద్దాం..

- వన్యప్రాణులు, పక్షుల సందడి
- మొదలైన జంగిల్ సఫారీ
- పెరిగిన పర్యాటకులు
- వీకెండ్‌లో గదులు ఫుల్



అడవిలో పర్యాటకులు



హరిత రిసార్ట్‌లో హైదరాబాద్ పర్యాటకులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో అందాలు ఆస్వాదిస్తూ.. వన్యప్రాణులు, రకరకాల పక్షులు, జంగిల్ సఫారీ ప్రయాణం ద్వారా పర్యాటకులు వీక్షించేందుకు అటవీశాఖ అనుమతి ఇచ్చింది. వర్షాలు తగ్గుముఖం పట్టడడంతో సఫారీ ప్రయాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. మూడు నెలల విరామం తర్వాత అక్టోబర్ 1 నుంచి జంగిల్ సఫారీ మొదలైంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడకు వచ్చి అడవులు చూసి మురిసిపోతున్నారు. పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం మధ్య గడుపుతున్నారు. వీకెండ్ రోజుల్లో గదులు ఫుల్‌గా ఉంటున్నాయని పర్యాటక అధికారులు పేర్కొంటున్నారు.

15 రోజుల్లో 600 పైగా మంది

జంగిల్ సఫారీ మొదలైన 15 రోజుల్లో తెలంగాణ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 600 పైగా మంది పర్యాటకులు ఇక్కడకు వచ్చారని అధికారులు తెలిపారు. నిజామాబాద్, హైదరాబాద్ నుంచి బస్సుల్లో వచ్చి ఇక్కడ సందడి చేస్తున్నారు. రాత్రి హరిత రిసార్ట్‌లో బస చేసి ఉదయం జంగిల్ సఫారీ ద్వారా వన్యప్రాణుల పరుగులు, పచ్చని అడవులను ఆస్వాదిస్తున్నారు. అటవీశాఖ ఏర్పాటు చేసిన బేస్‌క్యాంపు, అధ్యయన కేంద్రాలను పరిశీలిస్తున్నారు. అడవుల్లో నిర్మించిన కుంటల్లో పక్షుల కిలకిలలు చూసి మురిసిపోతున్నారు.

చెడిపోయిన దారులు..

గేట్ నంబర్ 1 నుంచి సుమారు 15 కి.మీ దూరం సఫారీ ప్రయాణం ఉంటుంది. గొండుగూడ బేస్‌క్యాంపు, బైసన్‌కుంట ప్రాంతాల్లో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, అడవి దున్నలు, రకరకాల పక్షులు ఎక్కువగా కనిపిస్తాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో సఫారీ దారి చెడిపోయినట్లు పర్యాటకులు పేర్కొంటున్నారు. అటవీశాఖ దృష్టిసారించి సఫారీ దారిని బాగు చేయిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలు సైతం కల్పించాలని కోరుతున్నారు.

రెండోసారి వచ్చాను



జన్నారం అడవులకు రావడం ఇది రెండోసారి. ఇక్కడ అందాలు చాలా బాగుంటుంది. సఫారీలో వెళ్లేటప్పుడు చుక్కలు దుప్పులు, నీలుగాయి పరుగులు కనువిందు చేశాయి. మా గ్రూప్ సభ్యులందరూ వాటిని చూసి మురిసిపోయారు.

– వినీత, హైదరాబాద్

17 రకాల పక్షులను గుర్తించాను



సఫారీ ప్రయాణంలో వివిధ రకాల పక్షులు కనిపించాయి. ఇందులో విదేశీ పక్షులు ఉన్నాయి. బైసన్ కుంట ప్రాంతంలో 17 రకాల పక్షులను గుర్తించాను. ఫొటోలు కూడా తీశాను. బైసన్‌కుంటలో పక్షులు అవాసం ఏర్పాటు చేసుకున్నాయి. అడవులు చాలా బాగున్నాయి. – సంకలిత దేలినాథ్

పర్యాటకుల సంఖ్య పెరిగింది



సఫారీ మొదలై 15 రోజుల్లోనే పర్యాటకుల సంఖ్య పెరిగింది. వీకెండ్‌లో గదులు నిండిపోతున్నాయి. ఆన్‌లైన్‌లోనే బుకింగ్ చేసుకుంటున్నారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ నుంచి చాలామంది వస్తున్నారు.

– వీరేందర్, హరిత మేనేజర్

చెదరని నెత్తుటి జ్ఞాపకాలు



ఖానాపూర్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అమరవీరుల స్మారక స్తూపం

- నాటి నక్సలైట్ల దాడుల్లో 19 మంది పోలీసుల దుర్మరణం
- అమరుల కుటుంబాల్లో తీరని శోకం
- రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

ఖానాపూర్: ఉమ్మడి రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు నేటికి చెదరని నెత్తుటి చేదు జ్ఞాపకాలు.. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎటుచూసినా అన్నల అలజడి.. తుపాకీ మోత చప్పుళ్లు వినబడుతుండేవి. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట నక్సలైట్ల విధ్వంసాలు, తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతుండేవి. వారి కవ్వింపు చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాల్లో పలువురు పోలీసులు అమరులయ్యారు. వారి సేవలు మరువలేనివి. ఈక్రమంలోనే ఎన్నో సంఘటనలు జరిగాయి. 1983 నుంచి అప్పటి ఆదిలాబాద్‌లో ఉన్న నిర్మల్ జిల్లా పరిధిలో నక్సలైట్ల ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఖానాపూర్ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో స్థావరాలు ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచే కార్యకలాపాలు నడిపేవారు. జిల్లాలో మొదటిసారిగా ఇక్కడి నుంచే విద్రోహచర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఖానాపూర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో ఉన్న 19 మంది పోలీసులు నక్సలైట్ల తూటాలకు బలయ్యారు. వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ఈనెల 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సాక్షి కథనం.

ఉమ్మడి రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు నేటికి చెదరని నెత్తుటి చేదు జ్ఞాపకాలు.. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎటుచూసినా అన్నల అలజడి.. తుపాకీ మోత చప్పుళ్లు వినబడుతుండేవి. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట నక్సలైట్ల విధ్వంసాలు, తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతుండేవి. వారి కవ్వింపు చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాల్లో పలువురు పోలీసులు అమరులయ్యారు. వారి సేవలు మరువలేనివి. ఈక్రమంలోనే ఎన్నో సంఘటనలు జరిగాయి. 1983 నుంచి అప్పటి ఆదిలాబాద్‌లో ఉన్న నిర్మల్ జిల్లా పరిధిలో మెల్లమెల్లగా నక్సలైట్ల ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఖానాపూర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో నక్సలైట్ల తూటాలకు 19 మంది పోలీసులు బలయ్యారు. ఖానాపూర్ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో నక్సలైట్లు స్థావరాలు ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచే కార్యకలాపాలు నడిపేవారు. జిల్లాలో మొదటిసారిగా ఇక్కడి నుంచే నక్సలైట్లు విద్రోహచర్యలకు శ్రీకారం చుట్టారు.

ఖానాపూర్‌లో అమరుల స్తూపం

ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమవీరుల స్మారకార్థం స్తూపం లేదు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేపచెట్టు కింద కొన్నేళ్లుగా శిలాఫలకంపై పేర్లు రాసి ఉంచారు. 2008లో అప్పటి సీఐ, ఎస్సైలు స్మారక స్తూప నిర్మాణానికి కృషిచేశారు. ప్రస్తుత సీఐ అజయ్‌తోపాటు ఎస్సై రాహుల్ గైక్వాడ్ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

సంఘటనల వివరాలివే..

- 1987 ఆగస్టు 18న కడెం మండలం అల్లంపల్లి క్యాంపునకు పోలీసులు నడిచివెళ్తుండగా అద్దాల తిమ్మాపూర్ వద్ద 30 మంది నక్సలైట్లు పకడ్బందీ పథకం ప్రకారం మాటువేసి విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఇద్దరు ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, ఏడుగురు కానిస్టేబుళ్ల ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు కానిస్టేబుళ్లు తప్పించుకొని ప్రాణాలు కాపాడుకున్నారు. గంధం రామస్వామి ఉరఫ్ సాగర్ అనే దళ కమాండర్ నేతృత్వంలో ఈ దాడి జరిగింది. ఘటన స్థలాన్ని అప్పటి సీఎం ఎన్టీఆర్ పరిశీలించారు. జిల్లాను ఆదర్శ జిల్లాగా ప్రకటించి గిరిజనులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.
- 1989 ఫిబ్రవరి 1న జరిగిన సంఘటనకు ఒక రోజు ముందు ఖానాపూర్ మండలం రాజూరా గ్రామంలో నక్సలైట్లు దోపిడీకి పాల్పడ్డారు. పోలీసులు ఆ గ్రామానికి వెళ్తుండగా కడెం మండలం సింగాపూర్ సమీపంలో పకడ్బందీ వ్యూహంతో నక్సలైట్లు పోలీసుల జీపును పేల్చివేశారు. ఎస్సై ఖాదర్‌ఉల్‌హక్, ఆరుగురు కానిస్టేబుళ్లు జి.బాపురావు, ఎండీ జలీల్, శేక్ హైదర్, వేణుగోపాల్, భోజారావు, ఎస్.మోహన్‌దాస్ ప్రాణాలు కోల్పోయారు. ఒకే కానిస్టేబుల్ ప్రాణాలతో బయటపడ్డాడు.
- 1999 డిసెంబర్ 5న కడెం మండలంలో బందోబస్తుకు వెళ్లి పోలీసులు వస్తుండగా ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామసమీపంలో నక్సలైట్లు రిమోట్‌కంట్రోలర్ సాయంతో పోలీసులు వెలుతున్న ప్రై వేటు జీపును పేల్చివేశారు. అందులో ప్రయాణిస్తున్న ఎస్సై మల్లేశ్‌తో పాటు కానిస్టేబుల్, ప్రై జీపు డ్రై వర్ దుర్మరణం చెందారు.

వార్డెన్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాజగోపాల్

లక్సెట్టిపేట:మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్, నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన రాజగోపాల్ ఈనెల 18న సాయంత్రం తన ఇంటి వద్ద యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17న ఇంటికి వెళ్లిన రాజగోపాల్... 18వ తేదీ సాయంత్రం బాత్‌రూంలోకి వెళ్లి యాసిడ్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను 100 నుంచి 252కి పెంచేలా రాజగోపాల్ కృషి చేశాడు. అయితే ఆమేరకు బిల్లులు రాకపోవడంతో రూ.7 లక్షల వరకు సొంతంగా ఖర్చు చేశాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు కూడా తెలిపారు. అయినా బిల్లులు రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. దీనిపై సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చాతరాజు దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నిర్మల్‌కు వెళ్లి పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు. ఏఎస్‌డబ్ల్యూవో సురేశ్‌ను వివరణ కోరగా ఈనెల 17న తన తల్లి ఆరోగ్యం బాగాలేదని రాజగోపాల్ ఇంటికి వెళ్లినట్లు తెలిపారు.

క్వారీ గుంతలో పడి యువ రైతు మృతి



యాదవ్‌రావు (ఫైల్)

మంచిర్యాలక్రైం: క్వారీలో గుంతలో ప్రమాదవశాత్తు పడి యువరైతు మృతిచెందినట్లు ఎస్సై మజారోద్దీన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హాజీపూర్ మండలం నాగారం గ్రామానికి చెందిన కొడప గంగు–భారతి దంపతుల కుమారుడు యాదవరావు(25). తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. వారికి ఉన్న నాగారం శివారులోని పత్తి చేనులో నీరు పట్టేందుకు శనివారం సాయంత్రం యాదవరావు అక్కడికి వెళ్లాడు. కరెంట్ మోటారుకు మరమ్మతు చేపడుతున్నాడు. ఈక్రమంలో మోటారు పంప్‌ను నీటిలో బిగించేందుకు క్వారీలో దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు సోమగూడెం యువకుడు



ఎంపికైన యువకుడు శంకర్

కాసిపేట:మండలంలోని సోమగూడెంకు చెందిన గురునాథం శంకర్ యూనివర్సిటీస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బాదె శేఖర్ తెలిపారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న శంకర్ ఈనెల 18న హన్మకొండలో జరి గిన కాకతీయ యూనివర్సిటీ అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో ప్రతిభకనబర్చాడు. హైదరాబాద్‌లో జనవరిలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ పోటీల్లో శంకర్ కాకతీయ యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈసందర్భంగా కోచ్‌తోపాటు తోటి క్రీడాకారులు శంకర్‌ను అభినందించారు.

ఆవుకు అంతిమ సంస్కారం



అంతిమ సంస్కారం చేస్తున్న స్థానికులు

మంచిర్యాల రూరల్ (హాజీపూర్): నంనూర్ పునరావాస కాలనీలో రైతు అత్తె శ్రీనివాస్‌కు చెందిన ఆవు ఆదివారం పాముకాటుతో మృతిచెందింది. ఈ ఆవు ఆ కాలనీలో జరిగే గృహప్రవేశాలకు వచ్చి మొదట ప్రత్యేక పూజలు అందుకునేది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన నంనూర్ పాత గ్రామంలోని అభయాంజనేయ స్వామి విగ్రహాలను ఆవు సమక్షంలోనే కదిలించారు. పాముకాటుతో మృతిచెందిన ఆవుకు స్థానికులు శాస్త్రోక్తంగా పూజలు చేసి అంతిమ సంస్కాకంలో భాగంగా ఖననం చేశారు.

వ్యక్తిపై కేసు

చెన్నూర్: సోషల్‌మీడియాలో మైనింగ్ అధికారిపై అసత్య, అసభ్య ఆరోపణలు చేసిన పట్టణానికి చెందిన ముత్యాల రవికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ దేవేందర్‌రావు తెలిపారు. మైనింగ్ అధికారి రామకృష్ణ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఎవరి మనోభావాలు దెబ్బతిసేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



గాలిపల్లి తారక్ (ఫైల్)

భీమారం: ఆర్థిక ఇబ్బందుల కారణంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..భీమారంలోని ఎస్సీ కాలనీకి చెందిన గాలిపల్లి తారక్ (19) మంచిర్యాలలో కొన్ని నెలలుగా కారు మెకానిక్ పని నేర్చుకున్నాడు. శిక్షణ అనంతరం భీమారంలో సొంతంగా కారు మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించున్నాడు. ఈ విషయాన్ని తండ్రి రమేశ్‌కు చెప్పగా అంత డబ్బు లేదని తర్వాత ఏర్పాటు చేద్దామనడంతో తారక్ మనస్తాపం చెందాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో మరో గదిలోకి వెళ్లి తలుపు వేసి గడియ పెట్టుకున్నాడు. అనుమానంతో తండ్రి రమేశ్ తలుపు బాదిన ఎంతకు తీయకపోవడంతో కిటికీ నుంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. తలుపులు బద్దలుకొట్టి వెళ్లి తారక్ కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఘటన స్థలానికి ఎస్సై శ్వేత చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యులను అడిగి వివరాలు సేకరించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పాడేటి రవి.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..



శేఖర్ (ఫైల్)

లక్ష్మణచాంద: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పీచర గ్రామానికి చెందిన నైనం శేఖర్ (28) గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందాడు. శనివారం ఉదయం గ్రామసమీపంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు అందించిన సమాచారంతో కుటుంబ సభ్యులు అతన్ని నిర్మల్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఖండాంతరాలు దాటిన నృత్య ప్రదర్శన



రవీంద్రభారతిలో అనూష కళాప్రదర్శన (ఫైల్)

కుభీర్: మండల కేంద్రానికి చెందిన కళాకారిణి ఠాకూర్ అనూష భరతనాట్య నృత్య ప్రదర్శన ఖండాంతరాలకు దాటింది. ఈమె తల్లిదండ్రులు మీరా–కరణ్‌సింగ్. తల్లి గృహిణి. తండ్రి ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. అనూషకు చిన్నప్పటి నుంచి పాటలు పాడటం(జానపద) డ్యాన్స్ చేయడం చాలా ఇష్టం. ఎంఏ ఇంగ్లిష్ విద్యనభ్యసించగా, ఆమె భరతనాట్యంలో డిప్లొమా పూర్తిచేసింది. 2008లో మా టీవీలో వచ్చిన రేలారే లా కార్యక్రమంలో పాల్గొని జానపద పాటలు పాడారు. గురువు సముద్రాల మాధవీ రామానుజం వద్ద భరతనాట్యంలో మెలకవలు నేర్చుకుంది. ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు, భద్రాచలం, తిరుమల తదితర నగరాల్లో 400లకు పైగా, అమెరికా, యూకే, మలేషియా దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. తండ్రి ఆదిలాబాద్‌లో పనిచేయడంతో ఆమె విద్యాభ్యాసం అక్కడే సాగింది. దేశ,విదేశాల్లో భరతనాట్య ప్రదర్శన చేసిన ఆమె ఎక్కడికెళ్లిన కుభీర్ వాసిగా చెబుతోంది.